ఐక్యతతో అవకాశాలు పొందండి


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య

తిరుపతి కల్చరల్: తిరుమల కల్యాణ కట్టలో పనిచేస్తున్న వారిపై కొందరు దుష్ప్రచారాలు చేస్తూ అప్రతిష్ట పాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారి మాయ మాటలు నమ్మి మోసపోకుండా ఐక్యతతో అవకాశాలు పొందాలని టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. విధి నిర్వహణలో తప్పులు జరిగితే తొలగించిన తర్వాత రిక్వెస్ట్ మీద తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నామని తెలిపారు. కల్యాణకట్ట సంఘ నేత వంకీపురం పవన్ మాట్లాడుతూ తిరుమలలో క్షురకులను అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. రామ్‌నారాయణ, సుధాకర్, మునికృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద వెలసిన తిరుపతి గంగమ్మకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని వేకువ జామున సుప్రభాతంతో నిద్ర మేల్కొలిపి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

● థ్యాంక్యూ.. సీఎం సార్..



జర్నలిస్టులకు ఇంటి స్థలాల పంపిణీకి ప్రభుత్వం పూనుకోవడంతో తిరుపతిలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ర్యాలీ నిర్వహించారు.

500 బారికేడ్స్ వితరణ

తిరుపతి క్రైం: ట్రాఫిక్, శాంతి భద్రతల నియంత్రణ కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏసీటీ ఫైబర్ నెట్ డిజిటల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో 500 బారికేడ్లు విరాళంగా అందజేశారు. మంగళవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్లో 10 లక్షల రూపాయలు విలువ చేసే 500 బారికేడ్లను జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డికి అందజేశారు. వీటిని ట్రాఫిక్, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఉపయోగిస్తామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీటీ ఫైబర్ నెట్ సంస్థ ఏపీ హెడ్ సుబ్బారావు, మేనేజర్ మహేష్ న్యూస్ మేనేజర్ వేదనారాయణ జిల్లా ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా



రాజారెడ్డికి నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

● ముగ్గురు మృతులకు నివాళులర్పించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: భారతంమిట్టలోని 9వ క్రాస్‌లో నివాసం ఉంటున్న వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నేత, పార్టీ వీరాభిమాని వల్లివేడు రాజారెడ్డి(68), సామిరెడ్డిపల్లికి చెందిన పాకాల డివిజన్ యూత్ అధ్యక్షుడు హరీష్ రెడ్డి నాయనమ్మ మునెమ్మ(70), ఐరంగారిపల్లి పంచాయతీ అడుసుపల్లి గ్రామానికి చెందిన వి.కోదండనాయుడు(80)ల మృతదేహాలకు తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అన్ని సమయాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పాకాల డివిజన్ అధ్యక్షుడు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, హరికృష్ణారెడ్డి, యూత్ ప్రెసిడెంట్ చంటి, గోపి, ఉమాపతినాయుడు, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, రాయలసీమ మోహన్, మధు, మురళి, పాల్గొన్నారు.

సీ రామాపురంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పర్యటన


చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి మంగళ హారతి పడుతున్న మహిళ

రామచంద్రాపురం: ప్రతి ఇంటా ఎనలేని అభిమానం, జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల గుండెల్లో నిండుకున్న సంతోషం, పార్టీ శ్రేణుల సత్కారాలు, సన్మానాలు, అన్నింటిని మించి గడప గడపలో మహిళలు కర్పూర హారతులతో ఘన స్వాగతం పలుకుతూ తమ ఆత్మీయతను చాటుకున్నారు. మంగళవారం మండలంలోని సీరామాపురం పంచాయతీలో చంద్రగిరి ఎమ్మెల్యే డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గడప గడపకు మీ హర్షిత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనపై గ్రామస్తులు పూలవర్షం కురిపించి, పువ్వులపై నడిపించుకుంటూ తమ గ్రామాలకు తీసుకువెళ్లారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తుంటే ఎమ్మెల్యే డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన సంక్షేమం, అభివృద్ధి పనులు యధావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఢిల్లీ రాణి, వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచి సుబ్రమణ్యంరెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జి గణపతి నాయుడు, నల్లందుల సుధాకర్‌రెడ్డి, బాబుయాదవ్, ఉప సర్పంచి పుష్పకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్‌ఆర్ సీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు వేణునాథరెడ్డి, గురుస్వామి రెడ్డి, రమేష్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మురళి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ సీపీ నేతకు మాతృ వియోగం

రామచంద్రాపురం: మండలంలోని పీవీపురానికి చెందిన వైఎస్‌ఆర్ సీపీ నేత భాస్కర్ రాయల్ తల్లి అన్నపూర్ణమ్మ మంగళవారం మృతి చెందారు. వైఎస్‌ఆర్ సీపీ పీవీపురం పంచాయతీ కన్వీనర్‌గా వ్యవహరించే భాస్కర్ రాయల్‌కు మాతృ వియోగం కలిగిందని తెలుసుకున్న ఎమ్మెల్యే డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట జడ్పీటీసీ ఢిల్లీరాణి, మండల ఇన్‌చార్జి గణపతి నాయుడు, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి హాకీలో ప్రతిభ చాటిన విద్యార్థి


మోగితను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ వెంకటరత్నం, హెచ్‌ఎం తదితరులు

చంద్రగిరి: విశాఖపట్నం అనకాపల్లి, నక్కపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-16 అంతర్ జిల్లా హాకి చాపియన్ షిప్2023-24 పోటీల్లో పనపాకం హైస్కూల్ విద్యార్థి మోగిత మూడో స్థానంలో నిలిచాడు. అరిగిలవారిపల్లెకు చెందిన మోగితను పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ పానేటి చెంగల్రాయులు అభినందించారు. పీడీ వెంకటరాజీను హెచ్‌ఎం అభినందించారు. జూపార్కు డైరెక్టర్ మణియాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ కళాశాల విద్యార్థులతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భగత్‌రవి, ఉపాధ్యక్షుడు అక్బర్, సహాయ కార్యదర్శి తేజ ప్రిన్సిపల్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పవన్, పురుషోత్తం, చక్రి తదితరులు పాల్గొన్నారు.

నవరస భరితం శ్రీనివాస సంగీత గేయధార


పి.సుశీల, భూమన్‌ను సన్మానిస్తున్న సాయికృష్ణ యాచేంద్ర తదితరులు

తిరుపతి కల్చరల్: చెన్నైకి చెందిన సి.శోభారాజ్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో మంగళవారం రాత్రి ప్రదర్శించిన శ్రీనివాస సంగీత గేయధార నవరస భరితంగా సాగుతూ సభికులను మైమరపించింది. ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ. సాయికృష్ణ యాచేంద్ర సారథ్యంలో చేపట్టిన ఈ శ్రీనివాస సంగీత గేయధారకు అవధాని ఆముదాల మురళి, డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు, కొప్పరపు అనంత శేషశైలేంద్ర, సి.శోభారాజా, సాహితీ వేత్త భూమన్ పృచ్ఛకులుగా వ్యవహరించగా, ముఖ్య అతిథిగా హాజరైన గానకోకిల పి.సుశీల సంగీత అంశం పృచ్ఛకురాలిగా వ్యవహరించారు. ఈ గేయధారకు చెన్నైకి చెందిన సంగీత విద్వాంసుడు నూకల హనుమంతరావు బృందం వాయిద్య సహకారం అందించింది. అనంతరం గానకోకిల పి.సుశీల చేతుల మీదుగా సాయికృష్ణ యాచేంద్రకు స్వర్ణ కిరీటధారణ చేపట్టారు.

బస్సులు కండీషన్‌లో ఉంచాలి

తిరుపతి అర్బన్: వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను కండీషన్‌లో ఉంచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జిల్లాలోని 11 డిపోలకు చెందిన మెకానిక్‌లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అడిగిన మేరకు విడిభాగాలను అందిస్తున్నారని.. స్టోర్స్‌లో మిగిలి ఉన్నాయని వెల్లడించారు. అయితే కొందరు మెకానిక్‌లు వాటిని అమర్చడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కండీషన్‌లో ఉండే సర్వీసులను మాత్రమే రూట్‌పై పంపాలని స్పష్టం చేశారు. తెల్లవారుజామున మంచు కురుస్తున్న నేపథ్యంలో ఫాగ్‌లైట్లు(అధిక ఫోకస్ ఉండేవి)ను అన్ని సర్వీసులకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిపో మేనేజర్లు నిర్లక్ష్యంగా వహిస్తే ఊరుకోమని ఆయన స్పష్టం చేశారు. మెకానిక్ ఇంజినీర్ నరసింహులుతోపాటు వివిధ డిపోల అధికారులు హాజరయ్యారు.

మంత్రి కారుమూరికి సత్కారం



తిరుపతి కల్చరల్: రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

విద్యుత్ అదాలత్‌ను వినియోగించుకోండి


విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధపూజ

తిరుపతి రూరల్: తిరుపతి డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్న విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి కోరారు. అవిలాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ కత్తి నాగరాజు ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈఈ వాసుదేవరెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పరికరాలతోపాటు వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్మికులకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరుపతిలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీఈ ఆంజనేయులు, ఏఈ కత్తి నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

10న తిరుపతిలో మహా భోగ్ ఉత్సవం

తిరుపతి కల్చరల్: స్వామి హథీరాం బావాజీ జీవసమాధి అయిన రోజును బర్షి ఉత్సవంగా నిర్వహించడం ఆనవాయితీ అని, ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠంలో వేడుకగా మహా భోగ్ ఉత్సవం చేపడుతున్నట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్ బి.శివ నాయక్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బంజారాలు, బంజారా భక్తులు, సాధు సంత్‌లు, బావాజీలు, గురువులు తిరుమల తిరుపతిని సందర్శించి హథీరాం బావాజీ జీవసమాధి అయిన రోజు బర్షి ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు. మహా భోగ్ ఉత్సవంలో భాగంగా బంజారా భక్తులు, స్వామీజీలతో నగరంలో శోభాయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కమిటీ ప్రతినిధులు ఎం.హరిబాబు నాయక్, బి.అశోక్ నాయక్, ప్రభాకర్ నాయక్, బి.కిషోర్ నాయక్, ప్రసాద్ నాయక్, మంజునాథ్ నాయక్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి జగనన్న

భాకరాపేట: అన్నదాతల ఆనందాన్ని చూసిన జగనన్న రైతు పక్షపాతి అని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో 3800 మందికి రైతు భరోసా అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

వంట పాత్రలు పంపిణీ

చంద్రగిరి: పనపాకం ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం వంట పాత్రలను మంజూరు చేసింది. ఈ సందర్భంగా మంగళవారం వైస్ ఎంపీపీ వెంకటరత్నం ఆధ్వర్యంలో హెచ్‌ఎం పురుషోత్తంరెడ్డితో కలసి వాటిని అందజేశారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన ఆహారాన్ని అందించడం కోసం ప్రభుత్వం ఖరీదైన స్టీలు వంట పాత్రలను అందించిందని హెచ్‌ఎం తెలిపారు.